# నవ్య వారపత్రిక

పునరుద్ధరణలో 'అక్షరమే ఆయుధం' అంటూ నినదించిన ఆంధ్రజ్యోతి దినపత్రిక, పేరులో మార్పు లేకుండా, తెలుగువారి గుండెల్లో తనదంటూ ఓ ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకుంది. అదే సంస్థనుంచి ఆంధ్రజ్యోతి వారపత్రిక 'నవ్య' నామంతో పునర్జన్మను పొందింది 2003లో. సంపాదకుడు శ్రీ శ్రీరమణ పత్రికని సార్థకనామధేయం చేయడంలో కృతకృత్యులయ్యారు. సంపాదకీయం, పాత సినిమా (తారల) ముచ్చట్లు, అమరావతి తరహా కథా శృంఖలాలు, మొగలి రేకులు వంటి ఉదాత్త హాస్యం- వగైరాలతో 'నవ్య'ను అలనాటి పత్రికలకు దీటుగా తీర్చిదిద్దారాయన. 2008 చివరలో ఎ.ఎన్. జగన్నాథశర్మ 'నవ్య' సంపాదకుడు అయినా- ఆ మార్పు పాఠకులు గుర్తించలేని తీరులో పత్రిక నిర్వహణ కొనసాగుతోంది. ప్రతి ప్రతిలోనూ ఏదో తెలియని ఆకర్షణ. చదివేక అనిర్వచనీయానందం. మెరుగైన రచనలకోసం అడపాతడపా పోటీలు నిర్వహించే 'నవ్య' ఏటా దీపావళికి ప్రత్యేక సంచికను తీసుకువచ్చే పాత సంప్రదాయాన్ని కొనసాగించడం ముదావహం. ఈ 74-పేజీల పత్రికకి మచ్చుగా ఫిబ్రవరి 25, 2009 సంచికని పరిశీలిద్దాం.

అట్టమీద అందాల తార. అట్టలోపల అపురూపమైన 'మంచిమాట'లూ, 'చిన్నారి' కబుర్లూ. (సాహితీ) ప్రముఖుల- 'అనుభవాలు-జ్ఞాపకాలు' (పేజి 4). కథలాంటి సంపాదకీయంతో 'మొదటి పేజి' (5). ఉత్తరాల్లో పాఠకుల స్పందనగా 'మెయిల్ బాక్స్' (6). మల్లాది నిర్వహణలో ఆలోచనకి పదునుపెట్టే 'మీరే డిటెక్టివ్ అయితే' (7). మూడు సీరియల్సూ, నాలుగు కథలూ, కథ చివర్లో రచయిత చిరునామా. పాటే ఆలోచనాత్మక వ్యాసాలతో 'టీ బ్రేక్' (16) . హాస్య వ్యంగ్యాలకు- బాలి గు'బాలిం'పు (18), శేఖర్ టూన్స్ (65). సినీ ప్రియులకు 'వెండి వెన్నెల' (28). వారానికో కథతో 'మహాభారతం' (32). పారమార్థిక కథల 'ఆరాధన' (44) పుస్తక సమీక్షల 'బుక్ చాట్' (47). జాతకఫలాల 'సౌభాగ్యచక్రం' (48). సినీ ప్రపంచంలో మరుగున పడిన మరో హీరో రామశర్మ (57), తొలి గయ్యాళి అత్త తాడంకి శేషమాంబ (58) వివరాలు. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ 'ఇంద్రధనుస్సు' (67). ఈ వారం 'పంచాజం' (73). ఇంకా వివిధ అంశాలపై సమయ, సందర్భోచిత వ్యాసాలు, మధ్యమధ్య సరదా కార్టూన్లు, కులాసా కబుర్లు, పోటీలు.

వీటన్నింటి విలువా వారానికి పది రూపాయలు.